క్లుప్తంగా

ఘనంగా పోలిపాడ్యమి



కొలనులో వెలిగించిన దీపాలు

మురళీనగర్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మురళీనగర్ రామాలయంలో పోలిపాడ్యమి పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్తీక దీపాలను వదలడానికి వీలుగా ప్రత్యేకంగా కొలను ఏర్పాటు చేశారు. తెల్లవారు జామున 4.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో వెలసిన ఉమారామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు ధ్వజస్తంభం వద్ద పూజలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి కొలనులో అరటి జోరెలపై కార్తీక దీపాలను వదిలి పూజలు చేశారు. ఆలయ నిర్వహక కమిటీ కార్యదర్శి సనపల వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



చిట్టిబాబుకాలనీలో వైద్య శిబిరంలో పాల్గొన్న స్థానికులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి చిట్టిబాబుకాలనీ సామాజిక భవనంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో బుధవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో స్థానిక కాలనీల వాసులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఆపరేషన్స్ ఉచితంగా చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అలరించిన బహుభాషా కవి సమ్మేళనం

సీతంపేట: సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన బహుభాషా కవి సమ్మేళనం అలరించింది. ఈ సందర్భంగా కేవీఎస్ మూర్తి, పీవీఆర్కే రావు, వీకే శర్మ ఆంగ్లంలో, డి.పద్మజ, పిళ్లా రమణమూర్తి సంస్కృతంలో, కె.రామజగన్నాథరావు ఒరియాలో, భాగవతుల సత్యనారాయణ మూర్తి, సీహెచ్ నిర్మలాదేవి, పీకే జయలక్ష్మి, రాజశేఖర్ హిందీలో, సీహెచ్.చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ, దామరాజు విశాలాక్షి, జీకే సుబ్రహ్మణ్యం, టి.సూర్యకళ, కేవీ రామారావు, జి.సుబ్బలక్ష్మి తెలుగులో కవితలు వినిపించారు. ఈ కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, ఎం.విజయగోపాల్ ప్రసంగించారు.

రెండున్నర కేజీల గంజాయి పట్టివేత

మద్రిపాలెం: కంచరపాలెం పరిధిలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఐదో పట్టణ పోలీసులు సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ మెహదీపట్నాకి చెందిన టి.భానుకిరణ్ (25) మంగళవారం మధ్యాహ్నం కంచరపాలెం బ్రిడ్జ్ నుంచి జ్ఞానాపురం వెళ్లే మార్గంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడని సమాచారం అందుకుని దాడి చేయగా..బ్యాగ్‌లో 2.5 కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. విశాఖ నుంచి హైదరాబాద్‌కు తీసుకువెళ్తున్నట్టు విచారణలో తేలింది. కంచరపాలెం సీఐ నిందితుడ్ని అదుపులోకి తీసుకుని, గంజాయి స్వాధీనం చేసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు.

వలంటీర్లకు సర్టిఫికెట్లు



వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జేసీ

సీతంపేట: స్థానిక శాంతిపురంలోని సివిల్ డిఫెన్స్ కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న 227వ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈకార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న 49 మంది వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు ప్రదర్శించిన పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉప పౌర రక్షణాధికారి కె.పద్మలత పాల్గొన్నారు.



తరగతి గది



తరగతి గది



అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో కొత్తగా నిర్మించిన అదనపు భవనం, అభివృద్ధి చేసిన పాత భవనం

స్మార్ట్ స్కూల్ క్యాంపస్‌గా ఎన్జీజీవోస్ కాలనీ ప్రాథమిక పాఠశాల

నాడు- నేడు.. బడి అందం చూడు

- 26వ వార్డులో రూ.1.96 కోట్లతో అభివృద్ధి
- అదనపు భవనంతో సమకూరిన 5 తరగతి గదులు
- లెర్నింగ్ బేస్డ్ స్కూల్ ఎన్విరాన్‌మెంట్


ఎన్జీజీవోస్ కాలనీ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి చేసిన ఖర్చు రూ.1.96 కోట్లు

గతంలో తరగతి గదుల సంఖ్య : 7

ప్రస్తుతం 12

గతంలో ఉన్న టాయిలెట్లు సంఖ్య: 4

కొత్తగా నిర్మించిన టాయిలెట్లు సంఖ్య: 10



తరగతి గదిలో స్టోరేజీ ర్యాక్స్



ఇది కదా అభివృద్ధి



నూతనంగా నిర్మించిన కళావేదిక



గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బెంచీలు

సీతంపేట : ఒకప్పుడు సాదాసీదాగా ఉన్న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఇపుడు స్మార్ట్ స్కూల్‌గా మారిపోయింది. టీడీపీ హయాంలో కనీస సదుపాయాలకు నోచుకోని పాఠశాల, ఇప్పుడు సకల సదుపాయాలతో మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ పాఠశాల నిదర్శనగా నిలుస్తోంది. జీవీఎంసీ 26వ వార్డులో ఎన్జీజీవోస్ కాలనీలో ఉన్న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలకు రూ.1.96 కోట్ల వ్యయంతో అదనపు భవనం నిర్మించడంతో పాటు, పాత భవనాన్ని, తరగతి గదులను, పాఠశాల ఆవరణను అన్ని సదుపాయాలతో చూడముచ్చటగా తీర్చిదిద్దారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, సిటీస్ ప్రోగ్రామ్ కింద రూ 1.96 కోట్లు నిధులతో పాఠశాల అభివృద్ధి, అదనపు భవన నిర్మాణం, మౌలిక సదుపాయాలు కల్పించారు. అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన అదనపు భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్ స్కూల్

గతంలో కంటే భిన్నంగా పాఠశాల పరిసరాల నుంచి విద్యార్థులు పలు విషయాలను నేర్చుకునేలా లెర్నింగ్ బేస్డ్ ఎన్విరాన్‌మెంట్‌తో తీర్చిదిద్దారు. ఇందులో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, కంపోస్ట్, క్రాప్స్ టు క్లాస్ రూమ్, ప్రిజర్వ్ వంటి సదుపాయాలు కల్పించారు. అలాగే రిక్రియేషన్ కోసం సురక్షిత బహిరంగ ఆట స్థలాలు, ఆట పరికరాలు, నేచర్ బేస్డ్ లెర్నింగ్, ఆరుబయట కూర్చునేలా సిమెంట్ బెంచీలు, ఆర్వో వాటర్, మెరుగుపర్చిన టాయిలెట్లు, హ్యాండ్ వాష్, వేస్ట్ బిన్స్ ఇలా విద్యార్థులకు మంచి అలవాట్లు నేర్పేలా పాఠశాలను అభివృద్ధి చేశారు.

సరికొత్తగా పాఠశాల భవనాలు

పాత భవనాన్ని కొత్తగా తీర్చిదిద్దారు. కొత్తగా నిర్మిస్తున్న అదనపు భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు తరగతి గదులు, రెండు టాయిలెట్లు, పై అంతస్తులో మూడు తరగతి గదులు నిర్మిస్తున్నారు. తరగతి గదుల్లో పిల్లలు కూర్చోడానికి అవసరమైన ఫర్నిచర్, బ్లాక్ బోర్డ్స్, నోటీస్ బోర్డ్స్, స్టోరేజి యూనిట్స్, టాయిలెట్లకు నిరంతర నీటి సరఫరా, తాగునీరు సదుపాయాలు కల్పించారు. అలాగే గ్రౌండ్‌లో సెమీ ఓపెన్ డైనింగ్ హాల్, కమ్ స్టేజి, వాలీబాల్ కోర్టు, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు అనుగుణంగా లెర్నింగ్ టైల్స్, స్కేల్, స్నేక్స్ అండ్ లేడర్స్, పాత్ వే పక్కన స్లైడింగ్ గేమ్స్‌తో ఆట స్థలాన్ని అభివృద్ధి చేశారు.

మా స్కూల్ సూపర్



గత ఏడాది నాలుగో తరగతిలో ఇక్కడ జాయిన్ అయ్యాను. అంతకు ముందు శ్రీకాకుళం జిల్లాలో ఒక ప్రైవేటు పాఠశాలలో చదివాను. జీవీఎంసీ పాఠశాలను చాలా బాగా అభివృద్ధి చేశారు. అన్ని సదుపాయాలు కల్పించారు. ఆట స్థలం, కొత్త తరగతి గదులు, డెస్క్ బెంచీలు, ఆర్వో వాటర్, టాయిలెట్లు, బుక్స్ పెట్టుకోవడానికి ర్యాక్స్ ఇలా ఎన్నో సదుపాయాలతో చాలా సూపర్‌గా ఉంది.

– కళ్లేపల్లి సాక్షిత్, 5వ తరగతి

పాఠశాల అందంగా మారిపోయింది



ఒకటో తరగతి నుంచి ఇదే పాఠశాలలో చదువుతున్నాను. తరగతి గదులు చాలక ఇబ్బంది ఉండేది. జగన్ మామ వచ్చాక కొత్త బిల్డింగ్ కట్టారు. పాత బిల్డింగ్‌ను కొత్తగా మార్చారు. పాఠశాల గోడలపై వేసిన పెయింటింగ్‌లతో చాలా విషయాలు నేర్చుకున్నాం. విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, లైబ్రరీ, డిజిటల్ రూమ్ , గ్రీన్ బోర్డ్స్, పిన్‌బోర్డ్స్ , యాక్టివిటీ ఏరియా చాలా సదుపాయాలు ఉన్నాయి. ఇపుడు మా స్కూల్ చాలా అందంగా మారిపోయింది.

– దోనూరి చంద్రిక, 5వ తరగతి

కార్పొరేట్ లుక్



ప్రభుత్వ పాఠశాలకు కార్పొరేట్ లుక్ కల్పించారు. గతంలో తరగతి గదులు సరిపోక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. స్మార్ట్ సిటీస్ ప్రోగ్రామ్‌కు మా పాఠశాల ఎంపిక కావడం, మేము కోరుకున్న దాని కంటే మిన్నగా కార్పొరేట్ స్థాయిలో పాఠశాల అభివృద్ధి జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అదనపు భవన నిర్మాణంతో 5 తరగతి గదులు, అత్యాధునిక టాయిలెట్లు, ఆర్వో వాటర్, బెంచీలు, ర్యాక్స్, బీరువాలు, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు అనుగుణంగా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, ఆట స్థలం, కళావేదిక నిర్మించారు. నా సర్వీసులో ఇప్పటి వరకు ఏ పాఠశాల్లో ఇంత అభివృద్ధి చూడలేదు. పాఠశాల అభివృద్ధితో పిల్లలు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– కె.పద్మజ రాణి, ప్రధానోపాధ్యాయులు

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- మళ్లీ జగన్‌నే ముఖ్యమంత్రిని చేసుకోవాలని కంపా హనోకు పిలుపు
- 45వ వార్డులో 'వై ఏపీ నీడ్స్ జగన్'



బోర్డును ఆవిష్కరించిన కార్పొరేటర్ కంపా హనోకు



కార్యక్రమానికి హాజరైన ఆర్పీలు, మహిళలు

తాటిచెట్లపాలెం : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని 45వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనో అన్నారు. వార్డులోని రాచంద్రనగర్ (255) సచివాల పరిధిలో పార్టీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు ఆదేశాల మేరకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సచివాలయ పరిధిలో ఇంతవరకు జరిగిన అభివృద్ధిని తెలియజేసే బోర్డును, పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన నవరత్నాలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌దే అన్నారు. ఈ ఒక్క సచివాలయ పరిధిలోనే సుమారు రూ.20 కోట్లపైన వివిధ పథకాలు ద్వారా డైరెక్టుగా లబ్ధిదారులకు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి రమణ, సీవో రమణి, ఏఈ ఉమామహేష్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రవి, పార్టీ నాయకులు హరి పట్నాయక్, సన్నీ, నాయుడు, దుర్గ, పైడినాగరాజు, నల్లబోతుల సతీష్, కాయల నర్సింగ్, మాత నర్సింగరావు, కలిశెట్టి మహేష్, పలిశెట్టి గణపతి, ఆదిలక్ష్మి, తవుడమ్మ, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, వలంటీర్లు, బూత్ ఇంచార్జిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న రెయ్యి వెంకటరమణ

జగనన్నతోనే సంక్షేమం

మద్రిపాలెం: అభివృద్ధి ఒక్క జగనన్నతోనే సాధ్యమని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు 289 సచివాలయం కన్వీనర్‌గా వున్న ఆయన ఆయా సచివాలయం పరిధిలోని కళింగనగర్‌లో ఇంటింటికీ వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల బ్రోచర్‌ను వారికి అందించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు యమున, విజయ, యశ్వంత్, కుమారి, పార్టీ కార్యకర్తలు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

47,48వ వార్డుల్లో కేకే రాజు పర్యటన



48వ వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న కేకే రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 47,48వ వార్డుల పరిధిలో గల కప్పరాడ, రాంజీ ఎస్టేట్, శ్రీనవాసనగర్ కొండవాలు ప్రాంతాలలో 47వ వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, 48వ వార్డు ఇంచార్జి నీలి రవితో కలిసి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు, మెట్ల మార్గాలు, డ్రైనేజీలు, కాలువలు, వీధి దీపాలు, నీటి కుళాయిలను, సామాజిక భవనాలను కేకే రాజు పరిశీలించారు. పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, గురవోజీ, రామారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిల్మ్ మేకింగ్‌లో వర్క్‌షాపు నిర్వహిస్తా



ఎల్.బి.శ్రీరామ్‌తో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతమ్మధార : నగరంలోని పలు కార్యక్రమల్లో పాల్గొనడానికి వచ్చిన సీనియర్ నటుడు ఎల్.బి. శ్రీరామ్‌ను బుధవారం గురుద్వార్ దరి ఓ హోటల్‌లో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్యదర్శి నరవ ప్రకాష్ మాట్లాడుతూ సినియాల్లో నటించకున్న లఘు చిత్రాల నిర్మాణం ద్వారా యువతకు మార్గదర్శకంగా ఉన్నారని అభినందించారు. విశాఖలో లఘు చిత్రాల నిర్మాణం అంశంపై వర్క్‌షాపు నిర్వహించాలని కోరారు. ఎల్.బి. శ్రీరామ్ మాట్లాడుతూ చిత్ర నిర్మాణానికి అవసరమైన అన్ని హంగులు విశాఖలో ఉన్నాయని ప్రభుత్వం ఆ దిశగా అడుగులు ముందుకు వేయాలన్నారు. అందుకు తనవంతు ఫిల్మ్ మేకింగ్ వర్క్‌షాపు నిర్వహించే ఆలోచన ఉందన్నారు. ఈకార్యక్రమంలో సూర్యప్రకాష్ రావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ లబ్ధి

సీతంపేట: తెలుగుదేశం హయాంలో పాలనను, ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమాభివృద్ధి పాలనను ప్రతి ఒక్కరూ బేరీజు వేసుకోవాలని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. వార్డులో హరిజనవీధి 01 సచివాలయం పరిధిలో బుధవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో ఎవరైన పింఛను దారుడు చనిపోతే వారి స్థానంలో కొత్తవారికి పింఛను మంజూరు చేసేవారని, జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను తక్షణమే మంజూరు చేస్తున్నారని తెలిపారు. నాలుగున్నరేళ్లలో 131 సచివాలయం పరిధిలో రూ. 19.88 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు నగదు బదిలీ జరిగిందన్నారు. అలాగే రూ.1.5 కోట్లు విలువైన రోడ్లు, డ్రెయిన్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. అనంతరం మండలాధ్యక్షులు జి.వి.రమణితో కలిసి పార్టీ జెండాను, డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, కన్వీనర్లు హరికృష్ణ, సారిపిల్లి సంతోష్, ఏపీడీదుర్గాప్రసాద్, వార్డు యూత్ ప్రెసిడెంట్ ఉప్పాడ సన్నీ,మహిళా నాయకులుఇ ఆర్పీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు పరిధిలో ఐసీడీఎస్‌కార్యాయలం ఎదుట అంగన్‌వాడీల నిరసన రెండో రోజు బుధవారం కూడా కొనసాగింది. ప్రభుత్వం తమ న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు తులసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అంగన్‌వాడీ మహిళలు పాల్గొన్నారు.

18న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవం

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డు నక్కవానిపాలెంలో శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాన్ని ఈ నెల 18న నిర్వహించనున్నట్టు కార్యనిర్వాహణాధికారి శేఖర్‌బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆలయ ఆవరణలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో పూజలు నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరువీధి మహోత్సవం, సాయంత్రం 6.30 గంటల నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సం జరగనుందన్నారు. స్వామి వారి కల్యాణంలో పాల్గొనే భక్తులు రూ.300 రుసుము చెల్లించాలన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ నక్క అప్పలరెడ్డి, సభ్యులు నక్క నాగమణి, ప్రవీణ్ కుమార్‌రాజు, సంతోష్‌బాయి, అర్చకుడు రామారావు శర్మ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరించిన రమేష్‌రెడ్డి, వేమన సంఘం ప్రతినిధులు

సీతమ్మధార (విశాఖ ఉత్తర): వేమన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన రెడ్డి కుటుంబ ఆత్మీయ కలయిక సంబంధించిన పోస్టర్‌ను బుధవారం సీతమ్మధారలోని స్వాతి ప్రమోటర్స్ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎం.డి. మేడపాటి రమేష్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఈ నెల 31వతేదీన ఆదివారం ముడసర్లోవలోని (రోజ్ గార్డెన్స్)ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం వరకు ఆత్మీయ కలయిక నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అలాగే ఆహ్వాన పత్రికను మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ సత్తిరామకృష్ణారెడ్డికి సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో నందిరెడ్డి బాలిరెడ్డి, నీలాపు రమణరెడ్డి, మరడ శ్రీనివాసరెడ్డి, కర్రి రామారెడ్డి, ఎస్.సంజీవరెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు



రామలింగేశ్వరాలయంలోదీపాలు వదులుతున్న భక్తులు

మద్రిపాలెం: జీవీఎంసీ 51,53 వార్డు పలు శివాలయాల్లో పోలి పాడ్యమి సందర్భంగా భక్తులు పోటెత్తారు.కోనేటిలో అరటి డొప్పలపై దీపాలు వెలిగించి నీటి లో వదిలారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ బర్కత్ అలీ, అటవీశాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు

51వార్డులో.. : గాంధీనగర్–2లో శ్రీ హరిహర క్షేత్రం యువసేన సేవా సంఘం ఆధ్వర్యంలో అమృత లింగేశ్వర స్ఫటిక లింగానికి ప్రత్యేక పూజలునిర్వహించారు. వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి

సీతంపేట: దేవాదాయశాఖ పరిధిలోని శివాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కృత్రిమ కొలనుల్లో బుధవారం వేకువ జామున నీటిలో దీపాలు వదిలి కైలాసనాథుడ్ని భక్తి శ్రద్ధలతో సాగనంపారు.స్థానిక గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయం, రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కొలనులో మహిళలు దీపాలను వదిలిపెట్టారు.